సాక్షి
నంద్యాల
శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఊయలలో ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శుక్రవారం హైదరాబాద్ దత్త నాట్యాలయం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం అన్నప్రసాద పథకానికి శుక్రవారం తిరుపతికి చెందిన జలందరమ్మ, అనంతపురానికి చెందిన శకుంతల రూ.1,00,116 చొప్పున వేర్వేరుగా విరాళాలు అందించారు.

న్యూస్‌రీల్

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: పోలీసు సిబ్బంది తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. శుక్రవారం ఎస్పీ తన కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న 10 మంది పోలీసులు మ్యూచవల్ ట్రాన్స్‌ఫర్, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ విషయాలను ఎస్పీ దృష్టికి తెచ్చారు.

శ్రీశైలంలో 84 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 84.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 852 అడుగులకు చేరుకుంది. ప్రతి రోజు జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు నీరు విడుదల జరుగుతుండడంతో జలాశయ నీటి మట్టం రోజురోజుకు తగ్గిపోతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు 6,982 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 0.592 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 1,022, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,560, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 2,000, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా ఎడమగట్టు కేంద్రం నుంచి 5,153 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.

ప్రత్యేక తరగతులను నిర్లక్ష్యం చేయవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

దొర్నిపాడు: ఉత్తమ ఫలితాలు సాధించేందుకే ప్రతి రోజు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిర్లక్ష్యం చేయరాదని జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక తరగతులకు చాలా మంది విద్యార్థులు హాజరు కాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల వద్ద చదువుకోవడానికి ఇబ్బందులు ఉంటాయనే ఉద్దేశంతో స్కూల్లోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి ప్రతి నిమిషం చాలా విలువైనదని తప్పని సరిగా హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఎంత మంది పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు, ఎలా చదువుతున్నారు, ఎలాంటి ప్రణాళికలు రూపొందించారనే విషయంపై ఆరా తీశారు. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉదయం సమయానికి రాకపోతే సాయంత్రం అదనంగా నిర్వహించాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న సున్నిపెంటలో పీజీఆర్ఎస్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, ఇందులో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొంటారని శ్రీశైలం ఐటీడీఏ పీడీ వెంకటశివకుమార్ తెలిపారు. తన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వెల్లడించారు. చెంచుగిరిజనులతో పాటు సాధారణ పౌరులు ఏవైనా సమస్యలుంటే కలెక్టర్‌ను కలిసి అర్జీలు ఇవ్వొచ్చని పీడీ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

పడిపోయిన మిర్చి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి ధరలు పడిపోతుండటంతో రైతుల ఆందోళన అంతా, ఇంతా కాదు. కర్నూలు మార్కెట్‌లో ఎండుమిర్చి ధరలు మరింత దయనీయంగా ఉన్నట్లు స్పష్టం అవుతోంది. కర్నూలు మార్కెట్‌కు శుక్రవారం మిర్చి 587 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.2,229, గరిష్ట ధర రూ.14,000 లభించింది. సగటు ధర రూ.9,499 మాత్రమే నమోదైంది. ప్రస్తుతం ధరలు మరింత పడిపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. వాము ధర మొన్నటి వరకు రూ.26 వేల వరకు వెళ్లింది. తాజాగా ధర పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు 1,052 క్వింటాళ్ల వాము వచ్చింది. కనిష్ట ధర రూ.1,009, గరిష్ట ధర రూ.24,240 లభించగా.. సగటు ధర రూ.10,333 నమోదైంది.

అంతా తికమక

- ఆర్‌యూ పరీక్షల విభాగంలో గందరగోళం
- ఐదారు నెలలకు ఫలితాల విడుదల
- సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం
- అవసరం లేకున్నా వివిధ భాషల్లో ప్రశ్నపత్రాల ముద్రణ
- కొందరు విద్యార్థుల ఫలితాలు మాత్రమే వెల్లడి
- సర్టిఫికెట్ల కోసం తప్పని తిప్పలు





పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

రాయలసీమ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం అంటేనే విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. అక్కడ ఏదీ షెడ్యూల్ ప్రకారం ఉండదని, నిబంధనల ప్రకారం పరీక్షలు జరగవనే ఆరోపణలు ఉన్నాయి. పరీక్ష ఫలితాలు సకాలంలో ఇవ్వరనే విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులకు మేలు చేయడం కన్నా.. ఎక్కువ నష్టమే వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు కలిగిస్తున్నట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఫలితాలు, సర్టిఫికెట్ల కోసం వర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉంటారు. ఇలా ఎందుకు జరుగుతుందని ఎవరైనా ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య అంటూ చేతులు దులుపుకోవడం తప్ప.. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదు.

> ➤ రాయలసీమ యూనివర్సిటీలో మేఘశ్యాం (పేరు మార్పు) అనే విద్యార్థి పీజీ పూర్తి చేశారు. పీహెచ్‌డీ చేసేందుకు రీసెట్ రాయగా ఉత్తమ ర్యాంక్ వచ్చింది. వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు మార్కుల జాబితాను సకాలంలో ఇవ్వకపోవడంతో మొదటి కౌన్సెలింగ్‌లో సీట్ అలాట్ కాలేదు. రెండో విడత కౌన్సెలింగ్‌లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం వచ్చింది. ఇలాంటి ఘటనలు వర్సిటీలో జరుగుతున్నాయి.

> ➤ ఓ విద్యార్థి డిగ్రీ సెమిస్టర్ పరీక్ష రాసేందుకు సుంకేసుల రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల కేంద్రాన్ని కేటాయించారు. ఆ విద్యార్థి పరీక్ష రాయడానికి సెంటర్‌కు వెళ్లగా బుక్‌లెట్ ఆ కేంద్రంలో లేదు. కర్నూలు డిగ్రీ కళాశాల కేంద్రంలో విద్యార్థి బుక్‌లెట్ ఉండటంతో తెప్పించి పరీక్ష రాయించారు. వృథా అయిన సమయాన్ని అదనంగా కూడా ఇవ్వలేదు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి.

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని ఏ వర్సిటీలైనా అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే తరగతుల నిర్వహణ, పరీక్షల నిర్వహణ తదితర వాటిని షెడ్యూల్ చేస్తారు. పరీక్షలు నిర్వహించిన రెండు మూడు వారాల్లోగా ఫలితాలు విడుదల చేయడం, ఫలితాలు వచ్చాక పది రోజుల్లోగా సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతోంది. దీంతో విద్యార్థుల ఉన్నత విద్యకు, ఉద్యోగాల దరఖాస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రాయలసీమ వర్సిటీలో మాత్రం అలాంటివి ఏమాత్రం జరగవు. ఏది ఏమి జరిగినా మేం అనుకున్న విధంగానే ఉంటుందనే ధోరణిలో ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేట్ బీఈడీ కళాశాలల యాజమానులు వర్సిటీ అధికారులతో పలు మార్లు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. ఇలాగే వ్యవహరిస్తే వేరే వర్సిటీల అఫ్లియేషన్‌కు వెళ్తాం.. ఎన్‌వోసీలు ఇవ్వాలని అడిగిన సందర్భాలు ఉన్నాయి.

ఇవీ సమస్యలు

- పరీక్ష సమయం ఇచ్చి ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ ప్రకటిస్తారు. అయితే అఖరి రెండు రోజుల ముందు వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాదు. వెబ్‌సైట్ ఓపెన్ అయిన తర్వాత సర్వర్ మొరాయిస్తుంది. విద్యార్థులందరి వివరాలు నమోదు చేయడానికి ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడాల్సివస్తుంది. తరువాతి రోజు నమోదు చేస్తే జరిమానా చెల్లించాల్సి వస్తోంది. ఇది అదనపు భారం.
- సెమిస్టర్ల వారీగా షార్ట్ మెమోస్ ఇవాల్సి ఉంది. అయితే ఒకటి, రెండు సెమిస్టర్లవి మాత్రమే ఇస్తారు. మిగతావి ఇవ్వకుండా ప్రొవిజినల్ సర్టిఫికెట్ ఇస్తారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే షార్ట్ మెమోస్ అందుబాటులో ఉండవు.
- ఉన్నత విద్యా మండలి పంపిన జాబితా ప్రకారం హాల్ టికెట్లలో విద్యార్థుల పేర్లు ఉండాలి. అయితే హాల్‌టికెట్లలో వివరాలు తప్పుగా వస్తాయి. దీన్ని సరిచేసుకోడానికి విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- బీఈడీ సెకండ్ మెథడాలజీలో పేర్లు తప్పుతడకగా వస్తున్నాయి. సంబంధిత విద్యార్థి కళాశాల ద్వారా వర్సిటీకి లేఖ పెట్టుకుంటే ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి.
- పరీక్ష తేదీకి వారం రోజుల ముందుగా హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండాలి. ఇక్కడ మాత్రం పరీక్ష ఒక్క రోజు ముందు కానీ డౌన్‌లోడ్ చేసుకునేందుకు సైట్ ఓపెన్ కాదు.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థి ఉంటే అతని బుక్‌లెట్ మరో సెంటర్‌లో ఉంటుంది. దీన్ని గుర్తించే లోగా పరీక్ష సమయం పూర్తి అవుతుంది.
- ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడం సర్వసాధారణం. కోడ్ నంబర్లు వేర్వేరుగా వస్తుంటాయి.
- బీఈడీకి సంబంధించి విద్యార్థులు ఎంత మంది పరీక్ష రాస్తుంటారో అన్ని ప్రశ్నపత్రాలు అవసరం లేకున్నా తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించి ఇస్తున్నారు.
- ఒక కోర్సుకు సంబంధించి విద్యార్థులు పరీక్షలు రాస్తే వారందరి ఫలితాలు వెల్లడించాలి. కానీ ఇక్కడ విచిత్రమేటిటంటే.. అందరి ఫలితాలు వెల్లడి కావు. కొందరివి మాత్రమే ఉంటాయి.
- ఫలితాలు వచ్చిన 15 రోజుల్లో మార్కుల జాబితాలు ఇవ్వాలి. ఇంకా కొంత సమయం అంటే నెల లోగా అందుబాటులోకి రావాలి. ఇక్కడ మాత్రం మూడు నెలలు దాటినా మార్కులిస్టులు విద్యార్థుల చేతికి రావు.
- డిగ్రీ 2, 4వ సెమిస్టర్ల పరీక్షలు మే 2024లో జరిగితే ఫలితాలు డిసెంబర్ 2024లో వెల్లడించారు. ఇప్పటికీ విద్యార్థుల మార్కుల జాబితాలు అందుబాటులో లేవు.
- పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 2024లో జరిగినా ఇప్పటి వరకు ఫలితాలు రాలేదు. డిసెంబర్‌లో 3వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు విడుదల కాలేదు.
- 2021- 23 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితాలు పూర్తి స్థాయిలో అందలేదు.
- 2022 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబర్ 2024లో నిర్వహించి మూడు నెలల తరువాత డిసెంబర్‌లో ఫలితాలు విడుదల చేశారు. మార్కుల జాబితాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు.
- 2023-25 విద్యా సంవత్సరం బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు అక్టోబర్ నెలలో జరిగాయి. ఇప్పటి వరకు ఫలితాలు ఇవ్వలేదు.
- ఇదే విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ ఫలితాలు రాకపోయినా రెండో సెమిస్టర్ పరీక్షలు జనవరి 2025లో నిర్వహించారు. ఫలితాలు రాలేదు.

పరీక్షల నిర్వహణ.. ఫలితాల విడుదల తేదీల్లో కొన్ని ఇలా..

కోర్సు	సెమిస్టర్	పరీక్ష నిర్వహణ తేదీ	ఫలితాల విడుదల తేదీ	సమయం
యూజీ	1	23-12-2023	8-4-2024	3 నెలలు
పీజీ	1	12-3-2024	22-8-2024	5 నెలలు
పీజీ	3	29-1-2024	23-7-2024	6 నెలలు
బీపీఈడీ	4	16-5-2024	14-8-2024	3 నెలలు
ఎంపీఈడీ	4	16-5-2024	8-10-2024	5 నెలలు
ఎల్ఎల్‌బీ	2	28-3-2024	2-7-2024	4 నెలలు
బీటెక్	8	28-12-2023	4-5-2024	5 నెలలు

సమస్యలు ఉన్నాయి



పరీక్షల విభాగంలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. పరీక్షల ఫలితాల విడుదలలో జాప్యం, సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం అవుతుందని చాలా మంది నా దృష్టికి తీసుకొస్తున్నారు. కొంత సాంకేతిక సమస్య ఉంది. దాన్ని పరిష్కరిస్తున్నాం. అవసరమైతే పరీక్షల విభాగం టెక్నికల్ ఏజెన్సీని సైతం మార్చాలనే నిర్ణయానికి వచ్చాం. భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్, ఆర్‌యూ

పాతాళగంగ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- అధికారులకు శ్రీశైల దేవస్థానం ఈఓ ఆదేశం



పాతాళగంగ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీశైలం ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: భక్తులు పుణ్య స్నానాలు చేసుకునే పాతాళగంగ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం పాతాళగంగలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి ఈఓ పరిశీలించారు. బారికేడింగ్, జల్లుస్నాన ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, శౌచాలయాలు మొదలైన వాటిని పరిశీలించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన బారికేడింగ్‌ను సంబంధిత అధికారులు తరచుగా పరిశీలిస్తుండాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలన్నారు.అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాట్లు చేయాలన్నారు. పాతాళగంగ వద్ద చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ , శౌచాలయాలను నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. పుణ్యస్నానాలు ఆచరించేటప్పుడు భక్తులు సబ్బులు, షాంపులు వినియోగించకుండా చూడాలన్నారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి, పర్యవేక్షకులు రాధాకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, ఏఈ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు మొత్తాలు జమ

నంద్యాల(అర్బన్): జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న కందులకు సంబంధించిన మొత్తాలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి తెలిపారు. ప్యాపిలిలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటా రూ.7,550 మద్దతు ధరతో 138 మంది రైతులకు సంబంధించిన 1800 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశామన్నారు. వీటికి సంబంధించి ప్రభుత్వం రూ. 1.36 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు.

టీడీపీ నేత అరాచకం

- విద్యుత్ కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగుల కిడ్నాప్
- 20 శాతం కమీషన్ ఇవ్వాలని హుకూం
- కారులో తిప్పుతూ దాడి
- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



సాక్షి టాస్క్ ఫోర్స్: అడిగినంత కమీషన్ ఇవ్వలేదని ఓ టీడీపీ నేత విద్యుత్ కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగులను కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటన ఆళ్లగడ్డలో కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఏపీఎస్‌పీడీఎస్‌ఎల్ సంస్థ గ్రామాల్లో నిరంతరాయం 24 గంటలు నాణ్యమైన త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ పనులను షిర్డీ సాయి సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఉద్యోగి బాబూరావు ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ రూరల్ మండలం నల్లగట్లలో ప్రత్యేక విద్యుత్ లైన్ పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ నేత ఆ సంస్థ నిర్వాహకులను కమీషన్ కోసం పట్టుబట్టారు. తమ అనుమతి లేకుండా ఎలా పనులు చేస్తారని, ఇందులో తమకు 20 శాతం కమీషన్ ఇవ్వాలని హుకూం జారీ చేసినట్లు సమాచారం. అందుకు వారు ఒప్పుకోక పోవడంతో శుక్రవారం నల్లగట్లలో పనిచేస్తున్న బాబూరావుతో పాటు మరో ముగ్గురు సిబ్బందిని వాహనంలో కిడ్నాప్ చేసి ఆళ్లగడ్డలోని టీడీపీ నేత ఇంటికి ఎత్తుకొచ్చి విచక్షణా రహితంగా దాడి చేశారు. అప్పటికే ఈ విషయం సంస్థ ప్రతినిధులకు తెలియడంతో వారు ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. వారు జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేత బాధితులను వాహనంలో ఎక్కించుకుని తిప్పుతూ బాగా కొట్టినట్లు తెలుస్తోంది. చివరకు పోలీసు అధికారులు టీడీపీ నేతను గట్టిగా హెచ్చరించడంతో ఎట్టకేలకు వారిని విడిచి పెట్టారు. బాధితులు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

'ట్రెజరీల్లో లంచావతారులు' పై లోకాయుక్త విచారణ

- సాక్షి కథనాన్ని సుమోటోగా స్వీకరించిన వైనం

సాక్షి ఎఫెక్ట్



కర్నూలు(సెంట్రల్): పదవీ విరమణ, మరణించిన ఉద్యోగుల కుటుంబాల నుంచి ట్రెజరీల్లో కొందరు అధికారులు లంచాల కోసం పీడిస్తుండడంతోపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. 'సాక్షి'లో ఈనెల 6వ తేదీన 'ట్రెజరీల్లో లంచావతారులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనాన్ని ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ సుమోటోగా తీసుకుని శుక్రవారం విచారణకు ఆదేశించారు. కర్నూలు, నంద్యాల ట్రెజరీల్లోని కొందరు ఉద్యోగులు రిటైర్డ్, మరణించిన ఉద్యోగుల పెన్షన్లు, కుటుంబ పెన్షన్లను సకాలంలో ప్రాసెస్ చేయడం కోసం లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ చేయాలన్నారు. వచ్చే నెల 24వ తేదీన నివేదిక సమర్పించాలని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రచురితమైన కథనంతో సంబంధం ఉన్న ఉద్యోగులను దూరంగా ఉంచి విచారణ చేయాలని సూచించారు. కాగా, ఉద్దేశ పూర్వకంగా ట్రెజరీ అధికారులు పెన్షన్లు, గ్రాట్యుటీ మొదలైన బిల్లులను సకాలంలో ఎందుకు ప్రాసెస్ చేయడం లేదన్నారు. కొంత సమయానికి వారి నుంచే లంచాల రూపంలో 2 శాతం నుంచి 4 శాతం వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. భవిష్యత్‌లో ఇలా జగరకుండా రాష్ట్రంలోని అన్ని ట్రెజరీలకు ఆదేశాలు ఇవ్వాలని ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజనీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు సూచించారు. ఒక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తేవాలన్నారు.

జిల్లా వృద్ధి రేటును పెంచండి

- విరివిగా రుణాలు అందించండి
- బ్యాంకర్లతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లా వృద్ధిరేటును గణనీయంగా పెంచాలని, ఇందుకు విరివిగా రుణాలు అందించి సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బ్యాంకు అధికారులకు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో బ్యాంకు మేనేజర్ల జిల్లా ఓరియంటేషన్ వర్క్‌షాప్ జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణాల మంజూరులో వ్యవసాయం, పర్యాటకం, వాటి అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కోస్తా ప్రాంతం తరహాలో మూడు పంటలు పండించే భూములు జిల్లాలో ఉన్నాయన్నారు. సహాయం చేయాలన్న భావనతో అన్ని ప్రభుత్వ రంగాల యూనిట్లకు రుణాలు అందజేసి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 129 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో కోటి చేప పిల్లలు పెంచుకునే స్థాయికి చేరుకోవాలని చెప్పారు. అధిక పాలు ఇచ్చే గేదెల కొనుగోలుకు బ్యాంకులు సహాయం అందించాలన్నారు. జిల్లాలో 21 పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ బ్యాంకర్లు, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డీజీఎం సురేంద్ర గౌడ్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటరమణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డీజీఎం ఉమామహేశ్వర రెడ్డి, సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ కిరణ్ ప్రభు, వివిధ బ్యాంక్‌ల బ్రాంచ్ మేనేజర్లు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి



రుద్రవరం సమీపంలో 22వ బ్లాక్ తూము వద్ద నీటిని పరిశీలిస్తున్న తెలుగుగంగ అధికారులు

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వల ద్వారా వచ్చే సాగు నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఆ శాఖ ఎస్ఈ శివప్రసాదరెడ్డి అన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి అధికారులు తెలుగుగంగ కాల్వకు గురువారం సాగు నీరు విడుదల చేశారు. ఆ నీరు శుక్రవారం తెల్లవారుజామున రుద్రవరం సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే గండ్లేరు (తుండ్లవాగు)జలాశయానికి చేరుకుంది. ఎస్ఈ తెలుగు గంగ ప్రధాన కాల్వ వెంట వెళ్తూ మండలంలోని 16,17,18,19,20,21,22,23 ఉప ప్రధాన కాల్వల తూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగోడు నుంచి తెలుగుగంగ కాల్వకు 2 వేల క్యూసెక్యుల నీరు విడుదల చేశారన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందుగా ఉప ప్రధాన కాల్వలకు కొద్ది మోతాదులో నీటిని వదిలి మిగిలిన నీటిని గండ్లేరు జలాశయంలోకి చేరేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ జలాశయాన్ని పూర్తిగా నింపాక ఉప ప్రధాన కాల్వల్లో నీటి పారుదల మోతాదును పెంచుతామని తెలిపారు. ఎస్ఈ వెంట ఈఈ శంకర్‌రెడ్డి, డీఈఈ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఇప్పుడే మండుతున్న ఎండలు!

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు



కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఈ సారి ముందస్తుగానే వేసవి వచ్చినట్లు కనిపిస్తోంది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు భానుడి భగభగలు పెరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున ఈ సారి వేసవి మరింత వేడిగా ఉటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మామూలుగా అయితే ఫిబ్రవరి మొదటి వారంలో 33- 35 డిగ్రీల వరకు, ఫిబ్రవరి నెల చివరి నాటికి 37-39 డిగ్రీల వరకు మాత్రమే ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సారి మాత్రం మొదటి వారంలోనే ఎండల తీవ్రత 37 డిగ్రీలు దాడుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు రోజులుగా చలి తీవ్రత తగ్గిపోయింది. శివరాత్రికి ముందే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రానున్న రోజుల్లో వేసవి ఎలా ఉంటుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. కాగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024 వేసవిలో రికార్డు స్థాయిలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సారి కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఉష్ణోగ్రతల నమోదు ఇలా..

- ➤ ఈ నెల 5న కర్నూలు నగరంలో 37.3, నంద్యాలలో 36 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోద య్యాయి.
- ➤ ఈ నెల 6న కర్నూలులో 36.3, నంద్యాల జిల్లాలో 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- ➤ శుక్రవారం నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో 37.8, గూడూరులో 37.3, కె.నాగలాపురంలో 37.2, కర్నూలు మండలం దిన్నెదేవరపాడులో 37.2, నంద్యాల జిల్లా చాగలమర్రిలో 37.7, రుద్రవరంలో 37, బనగానపల్లిలో 37.3, శ్రీశైలంలో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

క్లుప్తంగా

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై 10న సమీక్ష



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 19 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈనెల 10న మంత్రుల బృందం సమీక్షించనుంది. సోమవారం మధ్యాహ్నం 3గంటలకు శ్రీశైల దేవస్థానంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగే ఈ సమావేశానికి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంశాఖ మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి హాజరు కానున్నారు. ఇప్పటివరకు క్షేత్రంలో చేపట్టిన పనులు, ఇంకా చేయాల్సిన వాటిపై మంత్రుల బృందం సమీక్షించనుందని దేవస్థానం అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 41 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షలకు 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. డిగ్రీ పరీక్షలు 11, బీఈడీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరిగాయి. డిగ్రీ పరీక్షలకు సంబంధించి ఉదయం సెషన్‌లో 401 మందికి 360 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో 156 మందికి 129 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. బీఈడీ పరీక్షలకు 90 మందికి 72 హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా రమేష్‌బాబు

కర్నూలు న్యూసిటీ: కర్నూలు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్, ప్రజా సంబంధాల అధికారి ఏ.వి.రమేష్‌బాబు గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు కమిషనర్‌గా పనిచేస్తున్న బి.నాగరాజును కర్నూలు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య పర్యవేక్షకులుగా నియమించారు. కాగా గతంలో రమేష్‌బాబు ఆళ్లగడ్డ, డోన్ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేశారు.

గుండె పోటుతో ప్రయాణికుడి మృతి



మృతి చెందిన నాగయ్య

కొలిమిగుండ్ల: ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ఓ ప్రయాణికుడు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం వేపరాలకు చెందిన నాగయ్య(43) పని నిమిత్తం తాడిపత్రికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో జమ్మలమడుగు డిపో బస్సు ఎక్కాడు. కండక్టర్ టికెట్‌లు ఇచ్చే సమయంలో బాగానే ఉన్నాడు. చివరి సీటు ఖాళీగా ఉండటంతో నాగయ్య పడుకున్నాడు. కొద్ది సేపటికే గుండె పోటు రావడంతో సీటు కిందకు పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత సీటు కింద పడిపోయిన వ్యక్తిని తోటి ప్రయాణికులు గుర్తించి లేపినా లేవలేదు. మద్యం సేవించి పడిపోయాడని భావించి ముఖంపై నీళ్లు చల్లినా ఎలాంటి స్పందన లేదు. బస్సు కొలిమిగుండ్ల బస్టాండ్‌కు వచ్చాక విషయాన్ని డ్రైవర్, కండక్టర్ దృష్టికి ప్రయాణికులు తీసుకెళ్లడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు బస్సు తీసుకెళ్లారు. అక్కడే ఓ ప్రవేట్ వైద్యుడిని చూపించగా గంట క్రితమే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని కండెక్టర్ పోలీసులకు తెలియజేసి, మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.



కర్నూలు మండలం స్టాంటన్‌పురంలో తడికెల గదిలో నేలపైనే పాఠాలు వింటున్న విద్యార్థులు



సి.బెళగల్ మండలం ముడుమాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇసుకలో కూర్చున్న విద్యార్థులు

'నేల'బారు చదువులు

చిన్నారుల చదువులపై కూడా కూటమి ప్రభుత్వ కుట్రలు సాగుతున్నాయి. మన బడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. జరిగిన అభివృద్ధిని చూసి రాజకీయ శత్రువులు కూడా శభాష్ అన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'నాడు – నేడు' పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో అధునాతనమైన భవనాలు, కార్పొరేట్ స్థాయి బల్లలు, కుర్చీలపై చదువుకోవాల్సిన చిన్నారులు నేడు వెదురు తడికల దాపున, కటిక నేలపై అవస్థలు పడుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నందికొట్కూరు: గతేడాదిలో పట్టుబడిన మద్యం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు నంద్యాల జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డంప్ యార్డు ఆవరణలో 2024 సంవత్సరం జూలై–నవంబరు వరకు పట్టుబడిన మద్యం ఎక్సైజ్ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది కేసుల్లో పట్టుబడిన 133 లీటర్ల నాటుసారా, తెలంగాణ, ఏపీకి చెందిన 56 కేసులలో సీజ్ చేసిన 177 లీటర్ల మద్యం బాటిళ్లు, 67 లీటర్ల బీరు ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్,ఎస్ఐ జబ్రూల్లా ఉన్నారు.

పిన్నీసును మింగిన చిన్నారి



చిన్నారి కడుపులో కనిపిస్తున్న పిన్నీసు (ఎక్స్‌రే చిత్రం)

కర్నూలు (హాస్పిటల్): మూడేళ్ల చిన్నారి తెలియక పిన్నీసు మింగడంతో వైద్యులు చాకచక్యంగా తొలగించి పునర్జన్మ ప్రసాదించారు. శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి.అబ్దుల్ సమద్ వివరాలు వెల్లడించారు. నగరంలోని మూడేళ్ల చిన్నారి వారం రోజుల క్రితం ఇంట్లో పొరపాటున పిన్నీసును మింగడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ పాపకు ఎక్స్‌రే తీయగా కడుపులోని చిన్నపేగులో పిన్నీసు ఇరుక్కుపోయినట్లు గుర్తించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ బాల ప్రవీణ్‌కుమార్ సహకారంతో డాక్టర్ అబ్దుల్ సమద్ ఎండోస్కోపీ ద్వారా పిన్నీసును విజయవంతంగా బయటకు తీశారు. కొంత సేపటి తర్వాత పాప కోలుకోవడంతో అదే రోజు డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ అబ్దుల్ సమద్ తెలిపారు.

శ్మశాన స్థల వివాదంపై డీఎస్పీ విచారణ



శ్మశాన స్థలం వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం: చెట్నిహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక స్థలం వివాదంపై శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు విచారణ చేపట్టారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక, తుంగభద్ర నదీతీరంలోని సర్వేనంబర్ 125, 126లో 3.50 ఎకరాల శ్మశాన స్థలాలను డీఎస్పీ పరిశీలించారు. గ్రామస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ శివాంజల్, వీఆర్వో భీమయ్య, సర్వేయర్ అశోక్, గ్రామ సర్వేయర్ నవీన్ ఉన్నారు.

వివాదం ఇదీ...

శ్మశాన వాటిక స్థలంపై ఈ నెల 4వ తేదీన ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివాదం నేపథ్యంలో ఓ వర్గ వర్గీయుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే ఇంకో వర్గీయుల ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు విచారణ చేపట్టారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 3,735 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా సీసంగుంతల గ్రామానికి చెందిన కుడూరు శివారెడ్డి, లక్ష్మీపల్లె రాజుల ఎడ్లు 3,655 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు గెలుపొందాయి. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన రాచమల్లు సుధీర్‌రెడ్డి, చక్రవర్తి గౌడులకు చెందిన ఎడ్లు 3,324 అడుగులు లాగి మూడో స్థానంలో రూ.30 వేలు, కడప జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన రామ్‌చరణ్ ఎడ్లు 3,279 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు, మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన రోలి మేడమ్ వృషభాలు 3,141అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచి రూ.10వేలు, కడపజిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి, శివమేఘునాథ్‌రెడ్డి ఎడ్లు ఆరో స్థానంలో నిలిచి రూ.5 వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి.

మహిళ ఆత్మహత్య



మృతురాలు సుమిత్ర

ఆత్మకూరు రూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన సుమిత్ర (60) శుక్రవారం ఉదయం బలవన్మరణం చేసుకుంది. భర్త రాజారెడ్డి మార్నింగ్ వాక్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే సరికి ఆమె వంట గదిలో ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. పక్కింటి వారి సాయంతో కిందికి దించి చూడగా అప్పటికే మరణించి ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎర్రచందనం కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా అప్పీలు కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2011 ఆగస్టు 13వ తేదీ రుద్రవరం ఫారెస్ట్ అధికారులు తెలుగు గంగ కాలవ, పెద్ద వంగిలి బీట్, చిన్న బండ్ల శాల అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కర్నూలు జిల్లా, రుద్రవరం మండలం, ఆలమూరుకు చెందిన జి. వెంకటరమణ, పి నరసింహులు, ఏ మద్దిలేటి, షేక్ హుస్సేన్, పి ప్రసాద్‌లు అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి తొమ్మిది ఎర్రచందనం దుంగలను నరికి నాలుగు దుంగలను భుజాలపై తరలిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి ఆళ్లగడ్డ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. నేరం ఐదుగురిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఐదుగురికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ 2020 ఫిబ్రవరి 13వ తేదీన తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై ఐదుగురు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టులో అప్పిలు దాఖలు చేసుకున్నారు. కేసు విచారణ దశలో ఐదవ నిందితుడిగా ఉన్న పి ప్రసాద్ మృతి చెందాడు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ నలుగురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతులకు తక్‌పట్టీలు ఇస్తే ఒట్టు!

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సర్వర్ సమస్యను సాకుగా చూపి తక్‌పట్టీలు ఇవ్వడం లేదు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను అమ్ముకున్నారనేందుకు రైతులకు తక్‌పట్టీలు ఎంతో అవసరం. అయితే కొందరు కమీషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సర్వర్ పని చేయక ఇటు రైతులు, ఇటు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నా.. మార్కెట్ కమిటీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. మార్కెట్ కమిటీకి ప్రస్తుతం పాలక వర్గాలు లేవు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. సర్వర్ సమస్యలపైన, రైతులకు తక్‌పట్టీలు ఇవ్వకపోవడంపైన దృష్టి సారించడం లేదు. జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారే చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు తమ గోడును ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ కష్టాలు..

- వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో జాప్యం జరుగుతోంది.
- ధరల ప్రకటనలో జాప్యం జరుగుతోంది.
- కొందరు కమీషన్ ఏజెంట్లు తక్‌పట్టీల వెనుక సొంత లెక్కలు రాసి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు.
- కొంత మంది కమీషన్ ఏజెంట్లు రైతులకు తక్‌పట్టీలు ఇవ్వకుండా తెల్లకాగితాలపై వివరాలు రాసి ఇస్తూ దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

కోలుకోలేక వ్యక్తి మృతి



మృతి చెందిన రంగస్వామి (ఫైల్)

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై సోమయాజులపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చెన్నంశెట్టిపల్లె గ్రామానికి చెందిన గొల్ల రంగయ్య కొడుకు మామిడికాయల రంగస్వామి (55) వ్యవసాయంతో పాటు, బోర్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. 4 వ తేదీన సాయంత్రం టీ తాగడానికి తన ద్విచక్రవాహనంపై సోమయాజులపల్లె బస్సు స్టేజి వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళుతున్న తెలంగాణకు చెందిన బొలేరో వాహనం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రంగస్వామి తలకు బలమైన రక్త గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం స్టేషన్‌కు చేరుకుని పరిసరాలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు.

భయం వీడితే విజయం 'పది'లం!

- భవిష్యత్తుకు తొలి మెట్టు పదోతరగతి
- మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు
- ఒత్తిడి, భయం వీడితే విజయమేనంటున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో పది పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు 34, 261 మంది



నంద్యాల మండలం చాపిరేవుల జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు

ఏ విద్యార్థికైనా పదోతరగతి ఎంతో కీలకం. ఇక్కడ గట్టెక్కితేనే ఉన్నత విద్య చదివే అవకాశం ఉంటుంది. విద్యార్థి భవిష్యత్తుకు తొలిమెట్టు అయిన పదోతరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగనున్నాయి. జిల్లాలో 34,261 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే, పరీక్షల సమయం దగ్గర పడుతుండే కొద్ది వారు తెలియని భయం, ఒత్తిడికి గురవుతుంటారు. అయితే, ఈ సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళిక బద్ధంగా చదివితేనే మంచి మార్కులు వస్తాయంటున్నారు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు. ప్రతి మార్కు విలువైనదిగా భావించి ఇప్పటి నుంచే ప్రణాళికతో చదవాలని సూచిస్తున్నారు. – నంద్యాల (న్యూటౌన్)

భయం వీడాలి



విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై భయం వీడాలి. ప్రణాళికతో చదివితే భౌతిక శాస్త్రంలోనూ మంచి మార్కులు సాధించవచ్చు. ప్రధానంగా బాష్పీభవనం, హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి, లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్ర ధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్ మోటారు, ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటం సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, మన పదార్థపు విశిష్టోష్ణం కనుగొనడం, గాజుల దిమ్మె, పట్టకం వక్రీభవన గుణంకాలు, ఆమ్ల రసాయన చర్యలకు సంబంధించిన ప్రయోగాలు, స్ఫటిక జలం కృత్యం, ఆల్కహాల్, గ్లూకోజ్, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు నిర్మాణం అంశాలను బాగా చదవు కోవాలి. అలాగే తరచూ రివిజన్ చేస్తుండాలి. –పి.రాము, జిల్లా పరిషత్ హైస్కూల్, గాజులపల్లె గ్రామం

సులభంగా మార్కులు సాధించవచ్చు



సాంఘిక శాస్త్రంలో సులభంగా అధిక మార్కులు సాధించవచ్చు.చరిత్రను అర్థం చేసుకుని, రాజుల పాలన కాలాన్ని గుర్తుంచుకోవాలి. ప్రపంచ, దేశ చిత్రపటాలపై పట్టు సాధించాలి. మ్యాప్‌ల్లో ప్రాంతాల గుర్తింపు ప్రశ్నలకు సమాధానం రాసేటప్పుడు మ్యాపులో ప్రశ్న నంబర్ స్పష్టంగా రాయాలి. భారతదేశ భౌగోళిక స్వరూపాలు, పర్యావరణ ఉద్యమాలు, నేలల రకాలు, వ్యవసాయ పద్ధతులు, చరిత్రలో జాతీయ ఉద్యమాలు, జాతీయాదాయం,తలసరి ఆదాయం, జలవనరులు, సంస్కృతి, ఆధునీకత, ప్రపంచీకరణ వాటి పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థ, రాజ్యాంగం మౌలిక లక్షణాలు వంటి అంశాలను బాగా చదవాలి. -సుధాకర్, జెడ్పీహెచ్ఎస్, చాపిరేవుల గ్రామం, నంద్యాల(మం)

పునశ్చరణ చేసుకోవాలి



భౌతిక, జీవ శాస్త్రాలకు ప్రశ్నాపత్రం ఒక్కటే అయినప్పటికీ జవాబు పత్రాలు వేర్వేరుగా ఇస్తారు. మానవుడి శ్వాస ప్రక్రియ, ఆయుర్వేద మొక్కలు– ఉపయోగాలపై ప్రశ్నలు ఉంటాయి. అవయవ దానం, రక్తదానం, బాల్య వివాహాల నియంత్రణ, పర్యావరణానికి సంబంధించి నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణ స్లోగన్‌లు, గుండె నిర్మాణం, ఫలదీకరణం విధానంపై ప్రశ్నలొస్తాయి. ఇప్పటి నుంచి ప్రణాళికతో పునశ్చరణ చేసుకోవాలి. –రాజ్యలక్ష్మి, బాలికోన్నతస్కూల్, నంద్యాల

గణిత సూత్రాలపై పట్టు అవసరం



మ్యాథ్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే గణిత సూత్రాలపై పట్టు అవసరం. విశ్లేషణాత్మకంగా రాయండి అనే ప్రశ్నకు సమాధానం సూత్రాలతో వివరించాలి. సూత్రాలను బాగా నేర్చుకోవాలి. వాస్తవ సంఖ్యల నుంచి సమితి నిర్మాణ రూపం, రోస్టర్ రూపంలోకి మార్చడం వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. నిష్పత్తుల సమస్యలు సాధించడం, ఘనపరిమాణం, అలాగే ఉపరితల వైశాల్యం కనుక్కోవడం, రేఖీయ సమీకరణాలను సాధించడం, అంకశ్రేణి, గుణశ్రేణి, సంఖ్యాశాస్త్రం నుంచి ప్రాథమిక సమస్యలపై ప్రశ్నలు వస్తాయి.

–వరప్రసాద్, గణితం, నంద్యాల

సాధన చేయాలి



తెలుగులో సులభంగా మార్కులు సాధించవచ్చు. పరిచిత పద్యాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. శతక మాధుర్యంలో పద్యాలకు భావాలు నేర్చుకోవాలి. రామాయణంలోని కాండాలు (ప్రధాన అంశాలు) వ్యాస రూప ప్రశ్నలు, అపరిచిత గద్యాలు, విభాగంలో సంభాషణ, ప్రకటన, కరపత్రం, గేయం, కవితల్లో ప్రశ్నలు వస్తుంటాయి. లఘు ప్రశ్నలైన కవి పరిచయాలు, ప్రత్యక్ష దైవాలు, జలియన్ వాలాబాగ్, ప్రకృతి సందేశంలోని కథానిక, కథ, వ్యాసాలపై సాధన చేయాలి. అలంకారాలు బాగా నేర్చుకోవాలి.

–రాజా, జిల్లా పరిషత్ హైస్కూల్, యాళ్లూరు, గోస్పాడు(మం)

గ్రామర్ బాగా నేర్చుకోవాలి



ఇంగ్లిష్‌లో ఎక్కువ మార్కులు సాధించేందుకు గ్రామర్. వకాబులరీ బాగా నేర్చుకోవాలి. దీంతో పాటు ప్రోస్, పోయిట్రీలను అర్థం చేసుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. బార్, ట్రీ డయాగ్రామ్స్ ఎక్కువ నేర్చుకోవాలి. డైరీ ఎంట్రీ, పదసమూహ ప్రశ్నలపై దృష్టి సారించాలి. బయోగ్రాఫికల్ స్కెచ్, ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నలు ఇస్తారు. డయాగ్రామ్ ఇచ్చి స్టేట్‌మెంట్ రాయడం అనే ప్రశ్న అడుగుతారు. యాక్టివ్, పాసివ్ వాయిస్ నుంచి ఎక్కువగా స్టేట్‌మెంట్ ప్రశ్నలు వస్తాయి. –శారదా, మునిసిపల్ హైస్కూల్, నంద్యాల

చెవి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



చెవిని పరీక్షిస్తున్న ఆడియాలజిస్టు శివకృష్ణ

కర్నూలు (హాస్పిటల్): చెవిలో వచ్చే ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆడియాలజిస్ట్ శివకృష్ణ అన్నారు. బుధవారపేటలోని శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో 19వ వార్షికోత్సవం సందర్భంగా సిగ్నియ కంపెనీ ఆధ్వర్యంలో చెవుడు, మాటలు రాని వారికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఆర్.స్రవంతి, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ బి.స్రవంతి, డాక్టర్ మాధవి, డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, డాక్టర్ వి.శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ అధిక శబ్దాలు చిన్నపిల్లలకు వినపడకపోయినా, మాటలు రాకపోయినా ఆడియాలజిస్ట్‌ను కలవాలన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరం సోమవారం వరకు కొనసాగుతుందని తెలిపారు.